**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేదీ 11.02.2025** **సమయం. 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రతిపక్ష పార్టీలు సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు తప్పుని విమర్శించడం సబబు కాదని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.
2. భద్రాది కొత్తగూడెం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతలు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన దస్త్రం ఈ రోజు టి ఏ సి ముందుకు రానుంది.
3. 54వ సౌత్ జోన్ సెంట్రల్ రెవిన్యూ స్పోర్ట్స్ మీట్ ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈ ఉదయం ప్రారంభించారు.
4. ప్రయాగ్ రాజ్ లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్ళి తిరిగి వస్తున్న వాహనానికి జరిగిన ప్రమాదంలో రాష్ట్రానికి చెందిన ఏడుగురు మరణించారు.

...................................................

గుత్తా సుఖేందర్ రెడ్డి

ఓటర్ల జాబితా ఆధారం చేసుకొని సమగ్ర కుటుంబ సర్వే లెక్కలు తప్పుల తడకలుగా ఉన్నాయనడం సరికాదని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. ఈ అంశంపై ఈ రోజు నల్గొండలోని తన నివాసంలో పత్రికా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కొందరికి రెండు చోట్ల ఓటు ఉండటం వల్ల ఓటరు జాబితాకు, సర్వే లెక్కలకు తేడా ఉంటుందని అన్నారు. ఆధార్ కార్డుతో ఓటర్ కార్డును అనుసంధానం చేస్తే ఈ సమస్య ఉండదని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడం చరిత్రాత్మకమని అభిప్రాయపడ్డారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సర్వే

లెక్కలు తప్పని విమర్శించడం సబబు కాదని అన్నారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్ర ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారని ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం వాటిని జారీ చేస్తుందని హామీ ఇచ్చారు. .....పీఎన్

**సీతారామ దస్త్రం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ ఎత్తిపోతలు, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుల సమగ్ర నివేదికకు సంబంధించిన దస్త్రం కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలోని సాంకేతిక సలహా కమిటీ – టీఏసీ ముందుకు రానుంది. ఢిల్లీలో నిర్వహించనున్న టీఏసీ సమావేశంలో కీలక అనుమతులపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి రాష్ట్రం నుంచి ఈఎన్సీలు అనిల్ కుమార్, విజయభాస్కర రెడ్డి, కొత్తగూడెం సీఈ శ్రీనివాసరెడ్డి హాజరువుతున్నారు. అశ్వాపురం మండలంలో గోదావరి నదిపై సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మిస్తున్నారు. ఈ బ్యారేజీ వెనక జలాల ఆధారంగా ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి జిల్లాలకు తాగు సాగు నీరు అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నారు. టీఏసీ అనుమతి లభిస్తే, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు రావాల్సి ఉంటుంది. ....డెస్క్

**ప్రిన్సిపల్ సెక్రటరీ**

రామగుండం ఐటిఐ సెంటర్ ప్రాంగణంలో జరుగుతున్న ఏటిసి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్మిక, ఉపాధి శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ అన్నారు. 6 ట్రేడ్ కోర్సుల్లో యువతకు శిక్షణ అందించేందుకు ఐటిఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ - ఏటీసీ భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆదేశించారు. భవన నిర్మాణం పూర్తయితే శిక్షణకు సంబంధించిన పరికరాలను ఏర్పాటు చేసి తరగతులు ప్రారంభించవచ్చని అన్నారు.
పెద్దపల్లి, పీటీసీ

**బర్డ్ వాచింగ్**

మంచిర్యాల జిల్లా చెన్నూరు అటవీ డివిజన్ పరిధిలో ఉన్న ప్రాణహిత కృష్ణజింకల అభయారణ్యం, పారుపెల్లి, కిష్టంపేటలో ఏర్పాటు చేస్తున్న హరిత చెక్పోస్టులను తెలంగాణ చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఏలుసింగ్ మెరూ సందర్శించారు. చెక్ పోస్టులను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రాణహిత వన్యప్రాణి సంరక్షణ కేంద్రంలో గడ్డిమైదానాలు, సోలార్ పంపు సెట్ల ఏర్పాటు, నీటి కుంటలను నిర్మించే పనులను పరిశీలించారు...పులుల సంరక్షణకు మరిన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు..

పిటిసి, మంచిర్యాల

**స్వర్ణ గోపురం**

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ దివ్య విమాన స్వర్ణ గోపురానికి ఈనెల 23 ఉదయం 11 గంటల 54 నిమిషాలకు మహాకుంభ సంప్రోక్షణ నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ భాస్కర్రావు ఈ రోజు తెలిపారు. గోపురానికి స్వర్ణ తాపడం పనులు ఈ నెల 14వ తేదీ నాటికి పూర్తి కానున్నట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు మహాకుంభ సంప్రోక్షణ పూజలు వేద పండితులు ముహూర్తంగా నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఐదు రోజుల పాటు ఈ మహాకుంభ సంప్రోక్షణ పూజల్లో భాగంగా శ్రీనారసింహ హోమాన్ని జరపనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కుంభమేళా నుంచి గంగా, యమునా, సరస్వతి, గోదావరి, కృష్ణ జలాలను మహాకుంభ సంప్రోక్షణకు ఆలయానికి తీసుకొచ్చినట్లు వివరించారు.

పీ టీ సీ యాదాద్రి భువనగిరి

గవర్నర్

54వ సౌత్ జోన్ సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్ మీట్ 2024-25ను హైదరాబాద్‌లోని GMC బాలయోగి స్టేడియంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ ఉదయం లాంఛనంగా

ప్రారంభించారు. రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ క్రీడల్లో ఆరు దక్షిణాది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరికి చెందిన ఆదాయపు పన్ను, జీఎస్టీ, కస్టమ్ విభాగాలకు చెందిన 1000 మందికి పైగా పాల్గొంటున్నారు. 18 క్రీడావిభాగాలలో ఈ పోటీలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లోని ఆరు ప్రాంతాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్, భారత క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రసాద్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంత ఆదాయ పన్ను ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత, తదితరులు పాల్గొన్నారు. 12 వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమానికి మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ప్రముఖ ఆర్చర్ వర్దిసేని ప్రణీత హాజరవుతారు. ........పీఎన్

**వేములవాడ శివరాత్రి**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో జరిగే మహా శివరాత్రి జాతర వేడుకలు విజయవంతంగా నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. దీనికోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ నెల 25 నుంచి 27 వరకు జరిగే మహా శివరాత్రి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. యాత్రికులు ఆలయానికి చేరుకొనేందుకు వివిధ డిపోల నుంచి మొత్తం 857 బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. 20 లక్షల లీటర్ల నీటిని మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. 500 మంది పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్ పేర్కొన్నారు. .....పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**త్రిపుర గవర్నర్**

ప్రస్తుతం దేశం వికసిత్ భారత్ దిశగా సాగుతోందని, దాని సాధన విద్యార్థుల చేతుల్లోనే ఉందని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. మార్కులు వస్తేనే విజయం సాధించినట్లు కాదని పిల్లల ఆసక్తిని గుర్తించి ఆయా రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని చెప్పారు. నిన్న రాత్రి జరిగిన ఓ

పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ప్రసంగించారు. కాగా ఈ ఉదయం బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని త్రిపుర గవర్నర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిటిసి నిర్మల్ జిల్లా.

**రబీపంట**

రబీ పంటకాలానికి సంబంధించి వరి పైరుకు అగ్గి తెగులు సోకుతున్న నేపథ్యంలో, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట, మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి సందీప్ మా ఆకాశవాణి ప్రతినిధికి వివరించారు.

సౌండ్ బైట్

పిటిసి, రాజన్న సిరిసిల్ల జిల్లా

**రాహుల్ గాంధీ**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ రోజు రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సాయంత్రం ప్రత్యేకం విమానంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న అనంతరం హెలికాప్టర్లో వరంగల్ బయలుదేరి వెళతారు. అక్కడ పార్టీ ముఖ్యనేతలు, మంత్రులతో సమావేశం కానున్నారు. అనంతరం 7 గంటల 30 నిమిషాలకు కాజీపేట నుంచి చెన్నైకు రైల్లో బయలుదేరి వెళతారు. ......పీఎన్

రేషన్ కార్డులు

మీసేవా కేంద్రాల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ నిన్న సాయంత్రం నుంచి తిరిగి ప్రారంభమైంది. ఫిబ్రవరి 7న మీసేవాల కేంద్రాల్లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ తర్వాత సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయింది. ఈ నేపథ్యంలో మీసేవా అధికారులతో పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు నిన్న సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం తిరిగి ఈ ప్రక్రియను పునరుద్ధరించారు. దీంతో నిన్న రాత్రి నుంచే

మీసేవా కేంద్రాల్లో రేషన్ కార్డు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ప్రజా పాలన, ప్రజావాణి, కులగణనలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ఈ అంశంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు తారకరామారావు స్పందించారు. రేషన్ కార్డులు అందించేందుకు గాను ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సహేతుకంగా లేదని విమర్శించారు. రేషన్ కార్డులు ఇచ్చే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా లేదా అని ప్రశ్నించారు. .....డెస్క్

**రోడ్డు ప్రమాదం**

ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రాష్ట్రానికి చెందిన భక్తుల వాహనం రోడ్డు ప్రమాదానికి గురైన ఘటనలో ఏడుగురు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. వీరు ప్రయాణిస్తున్న మినీ బస్సును లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన సంభవించింది. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ సమీపంలోని సిహోరాలో ఈ ఉదయం ఎనిమిదన్నర గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. మృతులను హైదరాబాద్ నాచారం వాసులుగా గుర్తించారు. జాతీయ రహదారిపైకి సిమెంట్ లోడ్‌తో వెళ్తోన్న లారీ రాంగ్ రూట్లో రావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను సిహోరా ఆసుపత్రికి తరలించారు. .......డెస్క్

**ఈఎస్ఐ ఆసుపత్రి**

కార్మికుల సౌకర్యార్థం నల్గొండ జిల్లాలో నిర్మించ తలపెట్టిన ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని నల్గొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి నిన్న లోక్‌సభలో కేంద్రాన్ని కోరారు. కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలు ప్రస్తావిస్తూ, ఈ ఆసుపత్రికి నిధులు కేటాయిస్తామని గత బడ్జెట్లో ప్రతిపాదించినా.. ఎలాంటి

కేటాయింపులు జరగలేదని అన్నారు. ఈ ప్రాంతంలో మొత్తం 2 లక్షల 25 వేల మంది పలు రంగాల్లో సేవలందిస్తున్నా రని వారికి ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించి నిర్మాణ పనులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.
పిటీసీ, నల్లగొండ జిల్లా

**మెట్ల బావి పునరుద్ధరణ**

వరంగల్ కేంద్రంలో శివనగర్ లో ఉన్న "కాకతీయ కాలం నాటి మెట్ల బావి పునరుద్ధరణ" పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజి వాకడే మెట్ల బావి పనులను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మెట్ల బావిలోని అన్ని అంతస్తుల్లోనూ విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. ప్రహరీ నిర్మాణం, గేట్లు, ఫ్లోరింగ్, గ్రీనరీ పనులు చేపట్టారు. వారం రోజుల్లో రాష్ట్ర మంత్రులు మెట్ల భావిని ప్రారంభించే అవకాశం ఉన్న నేపథ్యంలో పనులలో వేగాన్ని పెంచారు.
వరంగల్ జిల్లా పి టి సి